క్లుప్తంగా

కంప్యూటరీకరణతో త్వరితగతిన సేవలు



ముప్పాళ్ళ: సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ కావటంతో సేవలన్నీ త్వరితగతిన, పారదర్శకంగా అందుతాయని ముప్పాళ్ళ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ టీ రజని చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో ముప్పాళ్ళ సహకార సంఘం మహాజనసభ సమావేశం గురువారం జరిగింది. సభ్యులు సంఘ సేవలను సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ పీ వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పాతూరి రామారావు, జెట్టి నాగమల్లేశ్వరరావు, అన్నపురెడ్డి రామచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మి గురువారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఇంటర్ ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో ఆరు ఖాళీలు, పదో తరగతిలో ఒక ఖాళీ ఉందన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు బడి బయటి పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్, తల్లి లేదా తండ్రి లేని పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విక్రయ హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పరిధిలో దుకాణాలకు గతవారం వాయిదా పడిన విక్రయ హక్కులకు వేలం గురువారం నిర్వహించినట్లు దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు విక్రయించే హక్కుకు రూ.5,64,000, చిత్ర పటాలు విక్రయించే హక్కుకు రూ.2,01,500, క్యాంటీన్, కూల్ డ్రింక్స్ హక్కుకు రూ.1,03,000, తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు రూ.80,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రుణ మేళాకు 398 మంది హాజరు



అమరావతి: రాష్ట్ర బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర నిర్వహించారు. ఈ రుణ మేళాలో పలు జాతీయ బ్యాంక్‌ల మేనేజర్లు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు. ఈ రుణాలకు ఆన్‌లైన్‌లో 524 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో క్రెడిట్ క్యాంపుకు 398 మంది హాజరయ్యారని ఎంపీడీవో పార్వతి తెలిపారు.

మ్యూజియంల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి




అమరావతి: ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలైన అమరావతి, నాగార్జున కొండ, చంద్రగిరి మ్యూజియంలను అభివృద్ధి చేయటానికి అదనపు నిధులను మంజూరు చేయాలని గురువారం ఢిల్లీలో భారత ప్రభుత్వ కేంద్ర పురావస్తు శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ లూర్దుస్వామికి అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జున కొండ అమరావతి, చంద్రగిరి మ్యూజియాల అభివృద్ధికి చర్యలు తీసుకొని అదనపు నిధులు కోటాయించాలన్నారు.

తోపుడు బండ్లు అందజేత

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని కార్మికులకు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు గురువారం చెత్త సేకరణకు తోపు బండ్లను కార్మికులకు పురపాలక సంఘ కార్యాలయంలో అందజేశారు. పూర్తి స్థాయిలో చెత్త సేకరణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా, మెప్మా ప్రాజెక్టు సీఓ రాజశేఖర్, కౌన్సిలర్లు చందూగౌడ్ పాల్గొన్నారు.

సమాచారం పొందడం మీ హక్కు..!

- సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన అవసరం
- కేవలం రూ.పదితో దరఖాస్తు చేసుకుంటే చాలు



సమాచార హక్కు చట్టం చిత్రం

బెల్లంకొండ: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవడం కోసం చాలా మంది ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల చుట్టూ తిరుగుతూ విసిగి వేసారి పోతుంటారు. అయితే తాము కోరిన సమాచారం పొందడానికి ఓ చట్టం ఉందని చాలా మందికి తెలియకపోవచ్చు. ప్రభుత్వ పాలనకు సంబంధించి ప్రతి విషయం ప్రజలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) ఉంది. ప్రతి సమాచారం తెలుసుకునే హక్కు పౌరులకు ఈ చట్టం కల్పించింది. అయితే ప్రజలకు పూర్తి స్థాయిలో ఈ చట్టంపై అవగాహన లేదనే చెప్పాలి. కేవలం రూ.పదితో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి సమాచారం అయినా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ చట్టం తీరు తెన్నులను పరిశీలిద్దాం.

సమాచారం తెలుసుకునే అధికారం

ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారమే సమాచార హక్కు చట్టం. ఈ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని, కావలసిన వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం, ఇతరత్రా అంశాలను తెలుసుకోవచ్చు.

- సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయ పౌర సమాచార అధికారి, పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు ప్రజలకు కనిపించే విధంగా కోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా ఉంచకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

సమాచారం కోరే విధానం

సమాచారం కావలసిన వారు సంబంధిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంది. దరఖాస్తు తెల్ల పేపర్‌పై రాస్తే సరిపోతుంది. దీనిపై అవగాహన లేకపోతే పౌర సమాచార అధికారి సహాయం తీసుకోవచ్చు.

- కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం, కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు.. వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవి అయితే తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది.

ఫీజు ఇలా...

తెల్ల రేషన్ కార్డుదారులకు దరఖాస్తు రుసుము ఉచితం. గ్రామ స్థాయి సమాచారానికి దరఖాస్తు రుసుము లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. దీనిని డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో చెల్లించవచ్చు. సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వడానికి అయ్యే ఖర్చును దరఖాస్తు చేసుకున్న వారు చెల్లించాలి. సాధారణంగా దరఖాస్తు ఫీజుతో పాటు ముద్రణ రూపంలో కోరితే పేజీకి రూ.2 చొప్పున జిరాక్స్ ఖర్చులు, సీడీ రూపంలో అయితే రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం. గంట తర్వాత ప్రతి గంటకు రూ.5 చొప్పున చెల్లించాలి.

సమాచారం పొందే అంశాలు

ఆర్టీఐ చట్టం ద్వారా పత్రాలు, మెమోలు, రికార్డులు, పత్రికా ప్రకటనలపై అడగవచ్చు. అదేవిధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్ బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, నమూనాలు, తనిఖీ, రికార్డులు మొదలైనవి ఉండొచ్చు. ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. రేషన్ డీలర్ల రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, వినియోగం, లబ్ధిదారుల వివరాలు, సీఎం సహాయనిధి వివరాలు, ప్రజా ప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వినియోగం తదితర వివరాలు కాగితాల పైనా, వీడియోల రూపంలోనూ పొందవచ్చు.

అవగాహన కల్పించాలి



సామాన్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం కోసం ప్రజలు కాళ్లు అరిగేలా తిరిగే సందర్భాలు అనేకం. అధికారులు కాలయాపన చేయకుండా సహకరించాలి. కార్యాలయాల వద్దకు దరఖాస్తుదారులను తిప్పుకోకూడదు.

– బూదాటి మరియదాసు, ఎస్సీ నాయకుడు, బెల్లంకొండ

గడువులోగా సమాచారం ఇవ్వాలి



ఆర్టీఐ చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువులోగా సమాచారం అందజేయాలి. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యులుగా ఉండాల్సి వస్తుంది. దరఖాస్తుదారు ఫిర్యాదు మేరకు కోర్టు చట్టరీత్యా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది.

– మర్రి సుబ్బారెడ్డి, ప్రముఖ న్యాయవాది, సత్తెనపల్లి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జొన్నకూటి



అమరావతి: అనుమానాస్పద స్థితిలో మరణించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి సత్యాలను వెలికితీయాలని అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జొన్నకూటి ప్రభుదాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధరణికోట మన్నా చర్చిలో అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్రైస్తవ బోధకులకు అన్ని విషయాలలో అండగా ఉండే పాస్టర్ ప్రవీణ్ మరణం క్రైస్తవులకు తీరనిలోటన్నారు. క్రైస్తవ సభలకు రాజమండ్రి వెళుతున్న ప్రవీణ్ ప్రమాదవశాత్తు మరణించారని చెబుతున్నా ఆయన మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అలాగే క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు రావెల అశోక్‌కుమార్, నండూరి పీటర్‌పాల్, జి.బాబురావు, డేవిడ్, విజయకుమార్, ఎలిషా, ప్రకాష్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు సహకరించాలి


ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందిస్తున్న పట్టణ ముస్లిం నాయకులు

సత్తెనపల్లి: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలని పట్టణ ముస్లిం నాయకులు కోరారు. గురువారం స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజ ప్రయోజనాలకు, వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు హాని కలిగించేలా ఉందన్నారు. ముస్లిం సమాజం హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి, వక్ఫ్ ఆస్తులను నియంత్రించే ప్రస్తుత చట్టాల్లో ఎలాంటి మార్పు చేయకూడదని భావిస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో సవరణ చట్టాన్ని తిరస్కరించి ముస్లింల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ముస్లిం నాయకులు ఉన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

రంజాన్ మాసంలో కఠినమైన ఉపవాస దీక్షలు పాటించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో భారీ స్థాయిలో సత్తెనపల్లి ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ముస్లిం పేదలకు రంజాన్ తోఫా పంపిణీలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లిం యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ కోరారు. పట్టణంలోని మున్సిపల్ వర్కర్స్ కాలనీ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో కంపా వీరమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందరన్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులపై పని భారం పెంచిందని, రాజకీయ వేధింపులు పెరిగాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణం లేకుండా గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కాంధ్రగుంట మేరమ్మను తొలగించడం అన్యాయమన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే విధంగా కరోనా సమయం నుంచి పని చేస్తున్న ఐదుగురు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, వారికి రూ. 21 వేల జీతం అమలు చేయాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ధర్నాలు, ర్యాలీలు జరుగుతాయని, దసలవారీగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్‌శాఖ మంత్రికి సంతకాలు సేకరణ చేసి, ఏప్రిల్ 10న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికి తేలకపోతే ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లొచ్చని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చిలక సునీత, మున్సిపల్ కార్మికులు కంభా కొండలు, ఉల్లిగడ్డ రామారావు, బత్తుల రామారావు, సేవరమ్మ, పార్వతి, అనంతలక్ష్మీ, అంకారావు, దేవరకొండ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార భూములను పరిశీలించిన ఆర్డీఓ



మాచర్ల రూరల్: పట్టణ శివారులోని రాయవరం జంక్షన్ వద్ద నిర్మిస్తున్న పెట్రోల్ బంకు, కల్యాణ మండపాల ఎన్‌ఓసీ పత్రాలను గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, వాటితో నిర్మాణాలు చేపట్టాలంటే ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు, కల్యాణ మండపం భూమి రికార్డులను నిశితంగా పరిశీలించి పలు సూచనలందించారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస మహల్, రామాటాకీస్ థియేటర్‌లోని సౌకర్యాలను పరిశీలించి, లైసెన్స్ రెన్యువల్ చేయించారు. తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, పెట్రోల్ బంకు నిర్వాహకులు గుంటుపల్లి బాబి, శ్రీనివాస మహల్ యజమాని షేక్ జాని, వీఆర్‌ఓలున్నారు.

నేడు ప్రజావేదిక

మాచవరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని అన్ని గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అనంతరం గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాల దృష్టికి వచ్చిన సమస్యలు, అభ్యంతరాలను ప్రజావేదికలో తెలియజేస్తారని తెలిపారు.

నేడు రుణ అర్హత మేళా

సత్తెనపల్లి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఓబీ ఎంఎంఎస్ ద్వారా బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జరిగే రుణ అర్హత మేళా(క్రెడిట్ క్యాంపు)కు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న వారంతా ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

పెదకూరపాడు : కార్పొరేషన్ రుణాల కొరకు క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సోమయాజులు గురువారం తెలిపారు. శుక్రవారం నిర్వహించే క్రెడిట్ క్యాంపకు మొత్తం 186 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

బెల్లంకొండ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రుణ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, కుమ్మరి కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రుణ మేళాకు హాజరు కావాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ రుణ మేళా జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ బ్యాంకుల అధికారులు, సెలక్షన్ కమిటీ సభ్యులు, మండల పరిషత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు


ఎన్నికల అధికారి నుంచి ఎన్నికైన పత్రాన్ని అందుకుంటున్న ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రమాదేవి

రాజుపాలెం: మండలంలోని ఐదు గ్రామాలలో ఉప సర్పంచ్ పదవుల ఎన్నికలు ప్రశాంతంగా గురువారం జరిగాయి. ఐదు గ్రామాలలో ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజుపాలెం ఉప సర్పంచ్‌గా మొర్రిబోయిన రమాదేవి, కొత్తబో ధనం.. తోట శ్రీనివాసరావు, అంచులవారిపాలెం.. డబ్బూరి అయోరియ్య, అనుపాలెం.. అంచుల సీతారావమ్మ, ఉప్పలపాడు ఉప సర్పంచ్‌గా రమావతు మంగ్లీభాయిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే ఈ ఎన్నికలు జరిగినట్లు తెలుస్తుంది.

ఉప సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం


బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం, బెల్లంకొండ గ్రామాలలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రెండు గ్రామాలలో ఉపసర్పంచ్‌లు రాజీనామా చేయడంతో అధికారులు ఎన్నికలను నిర్వహించారు. వెంకటాయపాలెంలో భుక్యా నాగమ్మ భాయి, బెల్లంకొండలో కొండవీటి రజాక్‌లను వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి అధికారులు ఎన్నిక పత్రాన్ని అందజేశారు.

ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేయాలి


మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ కె. సరోజినిదేవి

రెంటచింతల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25లో చేపట్టిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.సరోజినిదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో పంట కాల్వల పూడికతీత, సేద్యపు కుంటల తవ్వకం, పండ్లతోటలకు గుంతలు తీయడం వంటి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. రోజుకు కనీస వేతనం రూ.300 ఉపాధి కూలీలకు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు ఎఫ్‌ఏలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఏపీవో జి.జయచంద్రతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్‌లను ఎంపీడీఓ పంపిణీ చేశారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్ షిర్డిసాయి మందిరంలో గురువారం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని, సాయినాథునికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రుణ మేళాకు 190 మంది హాజరు



క్రోసూరు(అచ్చంపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈబీసీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు నిర్వహించిన రుణ మేళాకు 190 మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు ఎంపీడీవో కె.శ్రీనివాస్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బ్యాంకు మేనేజర్లతో ఇంటర్వ్యూలు జరిగినట్లు చెప్పారు. ఇందులో చైతన్య గ్రామీణ బ్యాంకు ఊటుకూరుకు 47 దరఖాస్తులు, క్రోసూరు 14, దొడ్లేరు 56, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 13, యూనియన్ బ్యాంకుకు 28, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 32 మొత్తం 190 దరఖాస్తులను పరిశీలించడం జరిగిందన్నారు.

విలేజ్ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

పెదకూరపాడు : మండలంలోని ఇరువురు విలేజ్ సర్వేలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ ధనలక్ష్మి గురువారం తెలిపారు. మండలంలోని పెదకూరపాడు సర్వేయర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, హుస్సేనగరం సర్వేర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ త్రివేణిలపై ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేనిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

పెదకూరపాడు: మండలంలో ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పొందాలంటే ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ ధనలక్ష్మి సూచించారు. మండలంలో 4,269 మందికి గాను ఇంకా 3,486 మంది ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. మండలంలో ఈ కేవైసీ చేయించుకోని వారి లిస్టు డీలర్ల వద్ద ఉందని, సమీపంలోని రేషన్ డీలర్లను సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మార్చి 31 వరకే ఈ అవకాశం ఉందని, ప్రతి ఒక్క రేషన్ లబ్ధిదారు వినియోగించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఐసీడీఎస్ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవి



సత్తెనపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్త్రీ సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఉమాదేవి అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన డివిజనల్ స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతాయని, ముఖ్యంగా బాలికలు చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లల రక్షణ కోసం ప్రవేశపెట్టిన చట్టాలు, పోక్సో చట్టం, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఎంఈవో–1 ఏ శ్రీనివాసరావు, ఎంఈవో–2 ఏ రాఘవేంద్రరావు, సత్తెనపల్లి, క్రోసూరు సీడీపీవోలు శ్రీలత, సరళాదేవి, ఏసీడీపీఓ సంతోష కుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడారు. ఈ సమావేశంలో చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈ శ్రమ డెత్ పరిహారానికి దరఖాస్తుకు గడువు పొడిగింపు

సత్తెనపల్లి: అసంఘటిత కార్మికులు ఈ శ్రమ గుర్తింపు కార్డు కలిగి 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31 లోపు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా పరిహారం కోసం దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి సీహెచ్ మూర్తి గురువారం తెలిపారు. ప్రమాదవశాత్తు మరణానికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యానికి రూ.లక్ష మంజూరు చేస్తారన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి పరిధిలోని వారు ఈ నెల 31 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పూజలందుకోమ్మ.. పోలేరమ్మ



పెదకూరపాడు : కోరిన కోర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ... పాడిపంటలతో... సుఖశాంతులతో.. మా గ్రామాన్ని చల్లంగా చూడు తల్లి అంటూ.. మండలంలోని లగడపాడు గ్రామంలో గురువారం భక్తులు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా వేడుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై గిరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.